క్లుప్తంగా

ముగిసిన శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు



నందిగామ: పట్టణ శివారుల్లోని పల్లగిరి కొండపై వేంచేసియున్న కల్యాణం వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజు స్వామి వారికి సుప్రభాత సేవ, విశేష పూజలు, సామూహిక సత్యనారాయణ స్వామి వారి వ్రతాలు నిర్వహించారు.అనంతరం భజన సంకీర్తన కార్యక్రమాలు జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో పలు గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వృద్ధులు, అనాథలకు అన్నదానం



పెనుగంచిప్రోలు: ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి దేవినేని రాజశేఖర్(నెహ్రూ) వర్ధంతి సందర్భంగా సోమవారం గ్రామంలోని శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద వృద్ధులు, బిచ్చగాళ్లు, పారిశుద్ధ్య కార్మికులకు మండలంలోని శివాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు ఏలూరి శివాజీ అన్నదానం ఏర్పాటు చేశారు. కోదాడలోని అనాథాశ్రమంలో దివ్యాంగులు 40 మందికి ఒక రోజు భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీతిరుపతమ్మవారి ఆలయ డైరెక్టర్ కురువెళ్ల రాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

వెండి తాపడం తయారీకి విరాళం



పెనుగంచిప్రోలు: స్థానిక తిరుపతమ్మవారి ఆలయంలోని అంకమ్మ వారి ఉపాలయం గోపురం వెండి తాపడం తయారీకి దాతలు రూ.10,116 విరాళం ఇచ్చారు. సోమవారం తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన రొక్కం రమేష్ కుటుంబ సభ్యులు ఈ విరాళాన్ని ఆలయ ఇన్‌స్పెక్టర్ బద్దుల కృష్ణ మోహన్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

'ఉపాధి' పనులు ప్రారంభం



వెంకటాపురం (పెనుగంచిప్రోలు): ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మార్కపూడి గాంధీ అన్నారు. సోమవారం మండలంలోని వెంకటాపురం గ్రామంలో పంట కాలువలో పూడిక తీత పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వేసవిలో పనులు చేసేవారికి ప్రత్యేక అలవెన్స్‌లు ప్రభుత్వం ఇస్తోందన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ కూచి నర్సయ్య, ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, గ్రామ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత అంబులెన్స్ సర్వీసు ప్రారంభం



జగ్గయ్యపేట అర్బన్: ప్రజలకు ఉచితంగా ఆంబులెన్స్ ఏర్పాటు చేసిన డ్రిల్లింగ్ ఖాజా సేవలు పలువురికి స్ఫూర్తిదాయకం అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద షేక్ బాలసైదా సేవా సమితి ఆధ్వర్యంలో అగ్రహారం గ్రామానికి చెందిన డ్రిల్లింగ్ ఖాజా ఏర్పాటు చేసిన జగ్గయ్యపేట లోకల్ ఉచిత ఆంబులెన్స్ సర్వీసును ఉదయభాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అత్యవసర సమయంలో ప్రజలకు అండగా నిలవాలనే సదుద్దేశంతో డ్రిల్లింగ్ ఖాజా ఉచితంగా ఆంబులెన్స్ వాహనాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గత ఏడాది డిసెంబర్ నెలలో కూడా డ్రిల్లింగ్ ఖాజా భవన నిర్మాణ కార్మికుల కోసం ఉచిత ఆంబులెన్స్‌ను ఏర్పాటు చేశాడని, మరలా ఇప్పుడు లోకల్ ఆంబులెన్స్ ఉచితంగా ఏర్పాటుచేశాడని కొనియాడారు.

మళ్లీ జగనన్నే సీఎం కావాలి

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఉదయభాను
- వార్డుల్లో కొనసాగుతున్న 'జగనన్నే మా భవిష్యత్తు'



పేటలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో పథకాలు వివరిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా మళ్లీ జగనన్నే సీఎం కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. సోమవారం పట్టణంలోని 7వ సచివాలయం పరిధిలోని కొత్త బంగారుపేటలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉదయభాను సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటినీ సందర్శించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత కలిగిన ఆర్థిక ప్రయోజనాలను..గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన వివక్ష పాలనను వివరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం వారి సమ్మతితో గోడలకు స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉదయభాను మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమల్లో రాష్ట్ర ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగిస్తున్నారని, నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకి సంక్షేమ పథకాల నగదు జమ చేస్తున్నారని తెలిపారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను 98.5 శాతం ఇప్పటికే పూర్తిచేశారని, గత పాలనలో 206 హామీలను ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత ఏ ఒక్కటీ అమలు చేయకుండా ప్రజలను నిలువునా దగా చేశాడని తెలిపారు. పేద ప్రజల కోసం దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో లేని విధంగా 33 లక్షల మందికి ఒకే సారి జగనన్న కాలనీల పేరుతో ఇళ్ల స్థలాలను అందజేసి ఇళ్ల నిర్మాణానికి సహకారం అందించారని తెలిపారు. విద్య వైద్య రంగానికి వేల కోట్లు ఖర్చు చేసిన ఏకైన ప్రభుత్వంగా రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందని కొనియాడారు.

కంప చెట్ల తొలగింపునకు చర్యలు..

7వ సచివాలయం పరిధిలో ఆంజనేయస్వామి ఆలయం వెనుక వైపు నుంచి బైపాస్ రోడ్డు వరకు స్థానికుల కోరిక మేరకు కంపచెట్లు తొలగింపు పనులను ఎమ్మెల్యే ఉదయభాను ప్రారంభించారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పట్టణ సచివాలయాల కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్ర, పార్టీ పట్టణ మహిళా విభాగం, యువజన విభాగం, మైనార్టీ విభాగం, వాణిజ్య విభాగాల అధ్యక్షులు పట్టణ అధ్యక్షురాలు మునిని రాజ్యలక్ష్మి, ఆవాల భవానీ ప్రసాద్, షేక్ మొహిద్దీన్, చారుగుండ్ల కొండ, సచివాలయ కన్వీనర్లు జాన్‌బాషా, రంగిశెట్టి శ్రీరంగమ్మ, ఏఎంసీ డైరెక్టర్ గోలి రామేశ్వరి శ్రీను, స్థానిక నాయకులు మోపూరి వెంకటేశ్వర్లు, కన్న వెంకటేశ్వర్లు, పిచ్చయ్య, వెంకట్రావు, కాటుబోయిన గురవయ్య, యానాదిరావు, షేక్ సైదులు, ఈర్ల రామకృష్ణ, దుడకా పుల్లారావు, కొండా నాగ తదితరులు పాల్గొన్నారు.

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): 'జగనన్నే మా భవిష్యత్తు' 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని సచివాలయాల మండల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, మాజీ ఎంపీపీ, పార్టీ నియోజకవర్గ నాయకులు గూడపాటి శ్రీనివాసరావు అన్నారు. గ్రామంలో ముగింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. గ్రామంలో మొత్తం 982 గృహాలను సందర్శించామన్నారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి వాసు, ఉప సర్పంచ్ గుత్తా శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు గూడపాటి రవికుమార్, పూసల కార్పొరేషన్ డైరెక్టర్ చేని కుమారి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కూచి విష్ణు, నాయకులు గూడపాటి చెన్నకేశవులు, తదితరులు పాల్గొన్నారు.

కంచికచర్ల : 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం మండల గ్రామాల్లో కొనసాగుతోంది. జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, గండేపల్లిలో సర్పంచి బి.రవికుమార్, పరిటాలలో సర్పంచి యద్దనపూడి ఆనందజ్యోత్స్న, మార్త శ్రీనివాసరావు, చింతా రవీంద్రనాథ్, మోగులూరులో సొసైటీ అధ్యక్షుడు బండి జానకిరామయ్య, వైఎస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, ఎస్ అమరవరంలో సొసైటీ అధ్యక్షుడు కోదాటి రామకృష్ణ, సర్పంచి కోదాటి సీతారాం, సొసైటీ అధ్యక్షుడు మట్టా శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పిల్లి భాగ్యలక్ష్మి, ఉప సర్పంచి బీ సుబ్బారావు, ఎం.చంద్రశేఖరరెడ్డి, వేల్పుల రమేష్, వేల్పుల శ్రీనివాసరావు, పరిటాల రాము, దేవరకొండ గురవయ్య, నారిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు వేమా రోజారమణి, మాడుగుల మధుబాబు, పాపట్ల సీత పాల్గొన్నారు.

ఉద్యోగ కల్పనకు ఉచిత శిక్షణ

రేపు నందిగామలో స్క్రీనింగ్ క్యాంపు

నందిగామ: ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జాబ్స్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన యువతీ, యువకులకు ఉచిత శిక్షణను ఇచ్చి పలు రంగాల్లో ఉద్యోగాలు కల్పించనున్నట్లు తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈనెల 19న నందిగామలో స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. పట్టణంలోని వెలుగు కార్యాలయంలో ఆరోజు ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. వివరాలకు 8790708075 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పౌష్టికాహారం పంపిణీ



వీరులపాడు(కంచికచర్ల): వీరులపాడు మండలం చెన్నారావు పాలెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు సర్పంచి ప్రత్తిపాటి మల్లికార్జునరావు ఫుడ్ కిట్‌లు సోమవారం పంపిణీ చేశారు. సర్పంచి మాట్లాడుతూ ప్రభుత్వం బాలల మరణాలు తగ్గించేందుకు విటమిన్లు కలిగిన నాణ్యమైన, రుచికరమైన భోజనం, పాలు, గ్రుడ్లు అందజేస్తుందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యకు చెక్



డ్రోన్‌తో రీ సర్వే పనుల ప్రారంభ కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతిబ్రహ్మం, తదితరులు



సరిహద్దు రాళ్ల ఏర్పాటును పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజకుమారి

అనిగండ్లపాడు (పెనుగంచిప్రోలు): జగనన్న భూ హక్కు–భూ రక్ష పథకంలో భాగంగా చేపట్టిన భూముల రీసర్వేతో భూ సమస్యలకు చెక్ పడనుందని సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం అన్నారు. సోమవారం గ్రామంలో ఏర్పాటు చేసిన డ్రోన్‌ను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకు వచ్చిన ఈసర్వే పనులను ఇతర రాష్ట్రాల వారు కూడా ఆదర్శంగా తీసుకుంటున్నారన్నారు. ఎప్పుడో బ్రిటీషు కాలంలో చేపట్టిన తరువాత జగనన్న పాలనలోనే తిరిగి సర్వే జరుగుతుందన్నారు. సర్వే అధికారులు గ్రామస్తులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, సర్వే సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే పనుల పరిశీలన

కంచికచర్ల : వందేళ్ల క్రితం నాటి భూముల్లో జగనన్న భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా ప్రభుత్వం రీ సర్వే చేపట్టి అనతికాలంలో ఖచ్చితమైన కొలుతలు, హద్దులతో సర్వే హద్దు రాళ్లను ఏర్పాటు చేయిస్తున్నామని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి అన్నారు. మండలంలోని పరిటాలలో సోమవారం ప్రభుత్వ, ప్రైవేటు భూములను రీ సర్వే చేసి ఆ భూముల్లో ప్రభుత్వం పంపిణీ చేసిన సరిహద్దు రాళ్లను పాతారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు భూ హక్కు పత్రంతో హాజరుకావాలని కోరారు. రైతులు, కౌలురైతులు తమ సిబ్బందికి సహకరించాలన్నారు. డీటీ నాగుల్‌మీరా, ఆర్ఐ శిరీష, వీఆర్వోలు వేముల ప్రదక్షిణరావు, వేల్పుల జనార్దన్, సర్వేయర్ బసవరావు, రైతులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలని వినతి

కంచికచర్ల : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమానికి నాలుగు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ వీ రాజకుమారి సోమవారం తెలిపారు. గ్రామంలో డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించాలని రెండు, పట్టాదార్ పాసుపుస్తకంలో తేడాలున్నాయని సరిచేయాలని, తాగునీటి సరఫరా కావటంలేదని మరో అర్జీ వచ్చాయని వివరించారు. వచ్చిన అర్జీలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కే బాలశంకరరావు, డీటీ నాగుల్ మీరా, ఏపీఎం కోట భాస్కరరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

'స్పందన'లో రెవెన్యూ సమస్యలే అధికం

నందిగామ: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని పలు మండలాలకు చెందినవారు 6 అర్జీలను అందజేశారని కార్యాలయ ఏవో రాజ్ కుమార్ తెలిపారు. రెవెన్యూ డిపార్ట్ మెంట్ సమస్యలకు సంబంధించి మూడు, విద్యుత్, వ్యవసాయ శాఖకు సంబంధించి ఒకటి చొప్పున, మెడికల్ డిపార్ట్ మెంట్‌కు సంబంధించి ఒకటి అర్జీ అందాయన్నారు.

ఆధార్ నమోదుకు ప్రత్యేక కేంద్రాలు

తిరువూరు: మండలంలో ఆధార్ కార్డుల కోసం డేటా ఎంట్రీ, పాత కార్డులలో డేటా మార్పులు, చేర్పుల కోసం ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. ఈ నెల 18న అక్కపాలెం, 19న కోకిలంపాడు, 20న మల్లేల, 26న ఆంజనేయపురం, 27న లక్ష్మీపురం గ్రామాల్లో ఈ కేంద్రాలను సచివాలయాల్లో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ఇబ్రహీంపట్నం: ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి లబ్ధిదారులకు తాజాగా ఆర్థిక సాయం మంజూరైంది. మండలంలో ఎనిమిది మందికి రూ.4.66 లక్షలు మంజూరు కాగా స్థానిక పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులు షేక్ మహబూబ్ సుబానీ, చనుమోలు జయంతిరావుకు పీఏసీఎస్ చైర్మన్ మునగాల శివారెడ్డి, జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు ఎన్.శివశంకరరావు, సచివాలయాల కన్వీనర్ల కో–ఆర్డినేటర్ లంకే అంకమోహనరావు సోమవారం అందజేశారు. లబ్ధిదారులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సచివాలయ కన్వీనర్లు నల్లమోతు ప్రకాష్, కె.వెంకటరత్నం మడుమల్లి ఆనంద్, ఎన్.దయాకర్, ఎన్.రవిబాబు పాల్గొన్నారు.

తాగునీరు కలుషితం



బావి లోపల లీకవుతున్న పైపులు



అపరిశుభ్రంగా ఉన్న బావి పరిసరాలు

షేర్‌మహ్మద్‌పేట (జగ్గయ్యపేట): గ్రామంలోని చెరువు వద్ద గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలోని తాగునీటి బావికి రక్షణ మూత లేకపోవటంతో తాగునీరు కలుషితమవుతుందని ప్రజలు పేర్కొంటున్నారు. కొన్నేళ్ల క్రితం చెరువు వద్ద తాగునీటి బావిని ఏర్పాటు చేశారు. దీంతో 500 కుటుంబాలకు ఈ బావి ద్వారా గ్రామ పంచాయతీ అధికారులు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే బావిపై మూత లేకపోవటంతో వ్యర్థాలు, తదితరాలను పలువురు బావిలో వేస్తున్నారని, పక్షులు, మూగజీవాలు ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందుతున్నాయని వాపోతున్నారు. బావిలోపల పైపులు లీకవటంతో ఆ ప్రాంతం అపరిశుభ్రంగా ఉంటోంది. కనీసం కొత్త పైపులు వేయాలనే ఆలోచన కూడా అధికారులు చేయటం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి బావిపై మూత ఏర్పాటు చేసి, పైపుల మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రభావితులైన పలువురు వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నారు. సోమవారం స్థానిక కొత్త బంగారుపేటకు చెందిన కజ్జ వీరభద్రం కుటుంబ సభ్యులు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు మునిని రాజ్యలక్ష్మి, నాయకులు తన్నీరు నాగేంద్రం, కుంచపు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ విధుల నుంచి మినహాయించాలి



తిరువూరు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న పీఏసీఎస్ ఉద్యోగులు

తిరువూరు: రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేసే ప్రక్రియలో సహకార సంఘాల ఉద్యోగులను మినహాయించాలని ఏపీ పీఏసీఎస్ ఉద్యోగుల సంఘం సభ్యులు సోమవారం తిరువూరు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. తమకు సహకార సంఘాల్లో రుణాల మంజూరు, బకాయిల వసూళ్లు తదితర విధులతోనే అధిక సమయం సరిపోతున్నందున ఆర్బీకేలలో ధాన్యం సేకరణకు ఇతర ఉద్యోగులను నియమించాలని కోరారు. సంఘ జిల్లా కార్యదర్శి రఘురాం పాల్గొన్నారు.

రఘునందన్‌కు అభినందన



పైడిమర్రి జీవితచరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అమరావతి సాహితీ మిత్రులు

తిరువూరు: భారతదేశం నా మాతృభూమి ప్రతిజ్ఞ రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు జీవిత విశేషాలను వెలుగులోకి తెచ్చిన రేపాక రఘునందన్‌ను కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ అభినందించారు. ఆదివారం రాత్రి అమరావతి సాహితీ మిత్రులు ఆధ్వర్యంలో గుంటూరులో జరిగిన కార్యక్రమంలో రఘునందన్ రచించిన పైడిమర్రి జీవితచరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన్ను సన్మానించారు. రచయితలు కంచర్ల విజయభాస్కర్, రమణ యశస్వి, రావి రంగారావు, ప్రమిద పత్రిక సంపాదకుడు బులుసు కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



అగ్నిప్రమాదాలపై మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

కంచికచర్ల : జాగ్రత్తలు పాటించి అగ్నిప్రమాదాలు నివారించాలని ఫైర్ అధికారి పీవీఎస్‌ఎం కృష్ణమూర్తి పేర్కొన్నారు. అగ్ని మాపక వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా స్థానిక అక్షర ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో అగ్నిప్రమాదాల నివారణపై సోమవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్యాస్ వెలిగించే సమయంలో కిటికీలు తెరిచి ఉంచాలన్నారు. భవనం పై అంతస్తులో ప్రమాదాలు జరిగినప్పుడు తాళ్ల సాయంతో కిందకి రావాలన్నారు. చిన్న పిల్లలు నిప్పుకు దూరంగా ఉండాలన్నారు. ఫైర్ సిబ్బంది బీ శ్రీను, తాజుద్దీన్, ప్రవీణ్, సంజీవ్ వర్మ, కిషోర్ రెడ్డి, జీవీ నర్సయ్య ఎం.అశోక్, స్కూల్ కరస్పాండెంట్ కాసరగడ్డ రామారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని గద్దె దించుదాం

మైలవరం: బీజేపీని గద్దె దించుదామని, దేశాన్ని కాపాడుకుందామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్.సీహెచ్. శ్రీనివాస్ తెలిపారు. మైలవరం సీపీఎం కార్యాలయంలో సోమవారం జరిగిన మండల కమిటీ సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో బీజేపీ వలన ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలపై గొంతు ఎత్తాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఆనాటి స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో మళ్లీ ఉద్యమించాల్సిన అవసరం ఏర్పడిందని శ్రీనివాస్ తెలిపారు. అనంతరం సీపీఎం ప్రచార భేరీ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఆర్.రమేష్, మండల నాయకులు సీహెచ్ సుధాకర్, వి. వెంకట్‌రెడ్డి, అమరేశ్వరరావు పాల్గొన్నారు.

పోరాటనగర్ తండాలో..

పోరాటనగర్ తండా(మైలవరం): కేంద్రంలో నిరంకుశ పాలన సాగిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపి మన దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలని సీపీఐ నాయకులు కొలకలూరి సీతయ్య పేర్కొన్నారు.

లౌకిక ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే లక్ష్యంతో ఈ నెల 14 నుంచి 30వ తేదీవరకు దేశ వ్యాప్తంగా సీపీఐ, సీపీఎం చేపట్టిన ప్రచార భేరీ సోమవారం మైలవరం మండలం కనిమెర్ల తండా, కత్తుల తండా, నాగులూరు తండా, పోరాటనగర్‌లో నిర్వహించారు. నాయకులు ఉలాస కుమారబాబు, బాణావత్ శివ నాయక్, కే. శాంతి ప్రసంగించారు.

ఆత్మకూరు రామకృష్ణకు తెలుగురత్న బిరుదు



రామకృష్ణను తెలుగురత్న బిరుదుతో సత్కరిస్తున్న సెర్ఫ్ సీఈఓ ఇంతియాజ్

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): కేంద్రీయ విద్యాలయం ఉపాధ్యాయుడు, ఫింగర్ పెయింటర్ ఆత్మకూరు రామకృష్ణకు తెలుగురత్న అవార్డు వరించింది. ఉగాది మహోత్సవాలు పురస్కరించుకుని జయహో భారతీయం, తెలంగాణా అసోసియేషన్ ఆఫ్ సౌతాఫ్రికా సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం ఆయనకు తెలుగురత్న బిరుదుతో పాటు బంగారు పతకం అందజేసి సత్కరించారు. గతంలో పరికరాలు లేకుండా 13.26 గంటల్లో ఏకధాటిగా చేతివేళ్లతో 100 పెయింటింగ్స్, 100 యూట్యూబ్ ఎపిసోడ్స్ చిత్రించి ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. చిత్రకళా రంగానికి వీరు చేసిన సేవలను గుర్తించి సన్మానించారు. అధికారభాషా సంఘం అధ్యక్షురాలు అలివేలు మంగాదేవి, సెర్ఫ్ సీఈఓ ఏఎండీ ఇంతియాజ్ పాల్గొన్నారు.

గంపలగూడెం సొసైటీలో నూరుశాతం రుణాల వసూలు

గంపలగూడెం: గంపలగూడెం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను రుణాలు నూరుశాతం వసూలు అయ్యాయని కేడీసీసీ బ్యాంకు చీఫ్ మేనేజర్ తెనాలి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం బ్యాంకులో నిర్వహించిన కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పెమ్మిరాజు ఆంజనేయులు, సీఈఓ ఏ. శ్రీనివాసరావు, సిబ్బందిని ఆయన అభినందించారు. మేనేజర్ కంచర్ల కనకదుర్గ, సూపర్‌వైజర్ ఏసోబు, డైరెక్టర్ ఆడెపు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ముసునూరు: పేకాట శిబిరంపై దాడి చేసినట్లు ఎస్ఐ ఎం.కుటుంబరావు తెలిపారు. విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు సూరేపల్లిలో సోమవారం సాయంత్రం రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి ఇద్దరిని అదుపులోనికి తీసుకున్నామని ఆయన తెలిపారు. వారి నుంచి రూ.3,000 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. నిందితులను మంగళవారం నూజివీడు కోర్టుకు తరలించనున్నట్లు ఎస్ఐ వివరించారు.